క్లుప్తంగా

ముమ్మరంగా సీసీరోడ్డు పనులు



చారకొండ: మండలంలోని శాంతిగూడెంలో ఉపాధి హామీ ద్వారా మంజూరైన రూ.15లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ శెట్టి శ్రీను ప్రారంభించారు. పనులను త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని అన్నారు. ఇప్పటికే చెట్ల పెంపకం, నిర్వహణ, పచ్చదనంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, నాయకులు గ్రామస్తులు ఉన్నారు.

సోషల్ మీడియా కార్యాలయం ప్రారంభం

కందనూలు: బీఆర్‌ఎస్ పార్టీ సోషల్ మీడియా కార్యాలయాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. పథకాలతో ప్రతి ఒక్కరూ లబ్ధిపొందాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గేటువాల్వ్



తాడూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో రోడ్డును అనుసరించుకొని మిషన్ భగీరథ పైపులను ఏర్పాటు చేయడంతో అక్కడక్కడ ఏర్పాటు చేసిన గేటువాల్వ్ ప్రమాదకరంగా మారాయి. అధికారులు రోడ్డు అనుసరించుకొని పైపులైన్ ఏర్పాటు చేసి ఇష్టానుసారంగా చేస్తున్నారు. గేటువాల్వ్‌ను మాత్రం రోడ్డుకు అనుసరించుకొని ఏర్పాటు చేసుకోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ఆకునెల్లికుదురు, మేడిపూర్, యాదిరెడ్డిపల్లి గ్రామాలకు వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఏర్పాటు చేసిన గేటువాల్వ్ ప్రమాదకరంగా మారాయి. అధికారులు పరిశీలించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రక్షణేదీ?



తాడూరు: మండల కేంద్రం నుంచి గగ్గలపల్లి మీదుగా అచ్చంపేట, కొల్లాపూర్, జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ డబుల్ రోడ్డు తాడూరు సమీపాన ఏర్పాటు చేసిన కాజ్‌వే బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. బ్రిడ్జి ఇరుపక్కల రక్షణ గోడ లేకపోవడంతో వేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ప్రైవేట్ వాహనం అదుపు తప్పడంతో తృటిలో ప్రాణనష్టం తప్పింది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు బ్రిడ్జిని పరిశీలించి ఇరు పక్కలకు రక్షణ గోడ ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు.

జర్నలిస్ట్ మృతికి నివాళులు



తెలకపల్లి: మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ చిలుక శేకర్‌రెడ్డి(46) ఆదివారం ఉదయం మృతిచెందాడు. ఆయన కొన్నేళ్లుగా జర్నలిస్ట్‌గా సేవలందించారని అన్నారు. విషయం తెలుసుకున్న జర్నలిస్ట్‌లు, ప్రజాప్రతినిధులు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నెహ్రూ చౌరస్తాలో ఆయన చిత్రపటాన్ని ఉంచి పూలమాలలతో నివాళులర్పించారు. ఆయన మృతి తీరని లోటు అని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా మండల జర్నలిస్ట్‌లు పాల్గొన్నారు.

ప్రజావాణి రద్దు

కోడేరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా సోమవారం నిర్వహించే ప్రజావాణిని రద్దు చేసినట్లు తహసీల్దార్ మల్లికార్జున్ రావు తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని, ఎవరు ప్రజావాణికి రావొద్దని ఆయన సూచించారు.

రైతులకు అండగా ఉంటాం

- ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు
- వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

అచ్చంపేట రూరల్: రైతన్నలు ఆకలితో అలమటించవద్దనే ఉద్దేశ్యంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. ఆదివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలో మార్కెట్‌కు వచ్చే రైతన్నల కోసం జీబీఆర్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. వివిధ పంటలను అమ్ముకోవడానికి మార్కెట్‌కు వచ్చే రైతన్నల కోసం రెండు నెలల పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నామని జీబీఆర్ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్‌పర్సన్ గువ్వల అమల తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరికీ అన్నం పెట్టే రైతన్న ధాన్యం అమ్మే సమయంలో ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశ్యంతో అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ అరుణ, వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, రాజేశ్వర్‌రెడ్డి, మార్కెట్ సెక్రటరీ శ్రీధర్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వ్యవసాయమార్కెట్ ఆవరణలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రైతులకు ఆదివారం అన్నదానం చేశారు. క్లబ్ కార్యదర్శి శ్రీదర్, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పంటను మార్కెట్‌కు అమ్ముకునేందుకు వచ్చిన రైతుల ఆకలి తీర్చడం ఆనందదాయకమన్నారు. అన్నదానం దాత శ్రీనివాస్‌రెడ్డి 450 మంది రైతులకు అన్నదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి వెంకటేష్, ఉపాధ్యక్షుడు హరికృష్ణ, మెంబర్‌షిప్ కమిటీ చైర్మన్ కిషన్, పీఆర్‌ఓ శ్రీనివాస్, తర్నికల్ శ్రీనివాస్, రాఘవేందర్, మనోహర్, వజ్రలింగం పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ ప్రారంభం

ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని భారత రాష్ట్ర కమిటీ రాష్ట్ర నాయకుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ఆదివారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఆయనతో సమస్యలు చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండ చూస్తామన్నారు. 24 గంటల విద్యుత్, రైతుబంధు, రైతుబీమాతోపాటు రైతు ప్రయోజనాలకు పెద్దపీట వేస్తుందన్నారు. ఆయన వెంట నాగులునాయక్, చంద్రశేఖర్‌రెడ్డి, సుభాష్, పెద్దాపూర్ సర్పంచ్ శ్రీనివాస్, లింగం తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి



కొల్లాపూర్‌లోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు



బల్మూర్‌లో సామగ్రి సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను ఆదివారం ఆర్డీఓ హనుమనాయక్, తహసీల్దార్ రమేష్‌నాయక్‌లు పరిశీలించారు. కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాలకు చెందిన 175 మంది ఉపాధ్యాయులు ఈ సెంటర్‌లో ఓటింగ్‌లో పాల్గొంటారని వారు వెల్లడించారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ సాగుతుందని తెలిపారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

లింగాల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. ఈ మేరకు సోమవారం పోలింగ్ కేంద్రంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కేంద్రంలో 30 మంది ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

బల్మూర్: ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక సోమవారం జరగనున్న పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బూత్ నంబర్ 16లో మొత్తం 62 మంది ఓటర్లు ఉండగా కేంద్రంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తహసీల్దార్ కిష్యానాయక్ తెలిపారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది సాయంత్రం పోలింగ్ కేంద్రానికి చేరుకొని సామగ్రి సిద్ధం చేసుకున్నారు.

కోడేరు: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ మల్లికార్జున్‌రావు ఆదివారం తెలిపారు. మండలంలో మొత్తం 18మంది ఎమ్మెల్సీ ఓటర్లు ఉన్నారని, ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద 144సెక్షన్ విధించినట్లు ఆయన తెలిపారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసా పత్రాలను అందుకున్న విద్యార్థులు

తాడూరు: మండల కేంద్రానికి చెందిన విద్యార్థులు ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో నిర్వహించిన ఓపెన్‌సౌత్ ఇండియా కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా వారు మెడల్స్, ప్రశంసాపత్రాలను అందుకున్నారు. కటాక్ విభాగంలో నవ్య సిల్వర్ మెడల్, పవిత్ర బ్రౌన్ మెడల్, వైష్ణవి బ్రౌన్ మెడల్, సోయాబ్, ప్రనీత్‌కుమార్, వినేష్‌కుమార్, పండు బ్రౌన్ మెడల్స్‌ను సాధించారు. మొత్తం 11 మంది ఆయా రకాల మెడల్స్‌ను సాధించడంతోపాటు ప్రశంసాపత్రాలను తీసుకున్నారు. పాఠశాల హెచ్ ఎం అనీల్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయు లు సీతారాంనాయక్, మాస్టర్‌లు వెంకటస్వామి, రవికుమార్ విద్యార్థులను అభినందించారు.

నరసింహపురంలో తాగునీటి ఎద్దడి



కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని తాళ్ల నరసింహపురంలో గత ఐదు రోజుల నుంచి తాగునీరు లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామం మున్సిపాలిటీ పరిధిలోకి వస్తుందని, ప్రస్తుతం తాగు నీరు కూడా సరాఫరా చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సమీపంలో ఉన్న వాగు నుంచి నీటిని తెచ్చుకొని తాగుతున్నామని వాపోయారు. మున్సిపాలిటీ అధికారులు, తక్షణమే స్పందించి మిషన్ భగీరథ పైపుల నుంచి మంచి నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం



నియోజకవర్గ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

కల్వకుర్తిరూరల్: టీడీపీ నియోజకవర్గ కార్యాలయాన్ని ఆదివారం ఆ పార్టీ నియోజకవర్గం కోఆర్డినేటర్ ప్రముఖ న్యాయవాది యాదిలాల్ ప్రారంభించారు. ఆమన్‌గల్, కడ్తాల్, మాడుగుల, తలకొండపల్లి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదిలాల్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మల్లయ్య, నరసింహులు, సత్యం, పంచాక్షరి, పద్మనాభం, జగన్, నరేష్‌యాదవ్ పాల్గొన్నారు.

బంజారా సమావేశానికి తరలిన నాయకులు



మాట్లాడుతున్న రవినాయక్

పెద్దకొత్తపల్లి: హైదరాబాద్‌లో జరిగిన బంజారా జాతీయ ఆత్మీయ సమ్మేళనానికి జొన్నలబొగుడ నుంచి బంజార నాయకుడు రవినాయక్ ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జొన్నలబొగుడ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి గిరిజనులకు ఉచితంగా బోర్లు, మోటర్‌లను అందించారన్నారు. అలాగే 100 మంది రైతులకు స్ప్రింక్లర్ సెట్‌లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో గోపాల్, హూనియా, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ: మండల పరిధిలోని పోతేపల్లికి చెందిన పెద్దమ్మకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.60వేల చెక్కును ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు. ప్రభుత్వం పేదల సంక్షేమానికి అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పరామర్శ..

మండలంలోని కేస్లీతండాలో దేశ్యనాయక్ గుండెపోటు మృతి చెందాడు. ఆదివారం ఎమ్మెల్సీ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ మేరకు కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. అదే విధంగా ఇటీవల హైదరాబాద్‌లో హత్యకు గురైన పవన్ కుమార్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట సురేందర్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, శ్రీనునాయక్, ఉపసర్పంచ్ లక్ష్మణ్‌నాయక్, హరికిషన్‌నాయక్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు మెడల్స్ బహూకరణ



కల్వకుర్తిరూరల్: రాష్ట్ర స్థాయి ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్‌లో గెలుపొందిన చిన్నారులకు జెడ్పీటీసీ సభ్యుడు భరత్‌ప్రసాద్ మెడల్స్‌ను బహూకరించారు. అనంతరం సత్తాచాటిన చిన్నారులను అభినందించారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

వెల్దండ: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికులా పనిచేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పేదకు సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అందించామన్నారు. ఇళ్లులేని పేదలందరికి ఇందిరమ్మ పథకం ద్వారా ఇళ్లు నిర్మించినట్లు పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. పార్టీని బలోపేతం చేసి ఎన్నికల్లో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో కిసాన్‌సెల్ తాలుకా అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, గోపాల్ నాయక్, వెంకటయ్య, శ్రీశైలం ఉన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983-84లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 40 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న వారందరు ఒకచోట చేరడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. ఆనాటి గురువులు రఘుపతిరావు, జహంగీర్‌నాయక్, మురళి, కృష్ణారెడ్డిలను విద్యార్థులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సామూహిక వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డాక్టర్ శంకర్, డాక్టర్ నాగరాజు, ఉమాశంకర్, నిరంజన్, చిన్నయ్య, శేఖర్, పోల శ్రీనివాసులు, ఆనంద్, మహమూద్‌ఖాన్, ఖలీల్, రాంజీనాయక్, ఎన్.శ్రీనివాసులు, పాండు, పూర్ణచందర్‌రావు, భాస్కర్‌రెడ్డి, విజయలక్ష్మి, సునీత, తారాబాయి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



క్రీడలను ప్రారంభిస్తున్న మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జంగయ్య, అసోసియేషన్ సభ్యులు

కల్వకుర్తి టౌన్: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జంగయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని సీబీఎం కళాశాల ప్రాంగణంలో జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపికలను ఆయన ప్రారంభించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 150 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారు ఈనెల 19న గోల్కొండలో ఆర్టిలరీ సెంటర్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డా.స్వాములు తెలిపారు. కార్యక్రమంలో స్వేరోస్ సభ్యులు, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ సభ్యులు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకారం



బల్మూర్: గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు, అధికారులకు సహకరించాలని ఎంపీపీ వేనేపల్లి అరుణ కోరారు. ఆదివారం మండలంలోని కొండనాగులలో ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొండనాగులలోని ప్రతి వార్డులో సీసీ రోడ్డు వేసి ప్రజల సమస్యలు తీర్చుతామన్నారు. కార్యక్రమంలో పీఆర్‌డీఈ భాషునాయక్, ఉప సర్పంచ్ యూసుఫ్, ఇద్రిస్, మాజీ విండో చైర్మన్ చంద్రమోహన్, రామస్వామిగౌడ్, బుచ్చన్న గ్రామస్తులు పాల్గొన్నారు.

పంటకు కంచెచీర



ఆకునెల్లికుదురులో మొక్కజొన్నకు రక్షణగా పెట్టిన చీరలు

తాడూరు: రైతు ఆరుకాలం కష్టించి పంట చేతికి వచ్చే సమయంలో అడవి పందుల బెడద తీవ్రమైంది. వీటి నివారణకు రైతులు నానా తంటాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే యాసంగిలో సాగు చేసిన మొక్కజొన్న పంట ఆశాజనకంగా ఉంది. మొక్కజొన్న కంకులు ఏర్పడే సమయంలో అడవిపందులు పంటను నాశనం చేస్తున్నాయి. వాటిని నివారణకు రైతులు మార్కెట్‌లో పాతచీరలను కొనుగోలు చేసి పంట చుట్టూ అమర్చుకుంటున్నారు. దీంతో కొంతమేర అడవి పందులను నివారించవచ్చని ఆయా గ్రామాల రైతులు తెలిపారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని దేశిటిక్యాలలో నూతనంగా నిర్మించిన కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలకు భూములు ఇచ్చిన నిర్వాసితులకు న్యాయం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి జి.అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం భూ నిర్వాసితులతో కలిసి మాట్లాడారు. కొంతమంది ఎస్సీ, బీసీలు తమ భూములను కార్యాలయాలకు ఇచ్చారని వారికి నామమాత్రంగా పరిహారం చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి కోల్పోవడంతో కనీసం జీవనోపాధి కరువైందని, చాలా మంది వలస వెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలను ప్రారంభిస్తామన్న ఎమ్మెల్యే భూములు కోల్పోయి అర్హత కలిగిన వారికి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు కలిపించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి పరుశరాములు, శ్రీనివాస్, బాలరాజు, ఆంజనేయులు, రాము పాల్గొన్నారు.

నిరుపయోగంగా బస్టాండ్

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ఉన్న బస్టాండ్ కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉండడంతో పరిసర ప్రాంతాల్లో మురుగునీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ముళ్ల పొదలు బస్టాండ్ చుట్టూ కమ్ముకుపోయాయి. దీంతో దోమలు వ్యాపించడంతోపాటు దుర్వాసన వెదజల్లుతోంది. రాత్రి సమయాల్లో నడిచేందుకు జంకుతున్నారు. బస్టాండ్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చి రాకపోకలు కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండ ప్రస్తుతం ఎండాకాలంలో బస్టాండ్ లేక రోడ్లపైనే నిల్చువాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని బస్టాండ్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్టీసీ డిపో మేనేజర్ రాజేశ్వర్‌ను వివరణ కోరగా బస్టాండ్‌లోకి బస్సులు రాకపోకడం విషయాన్ని అధికారులకు తెలియజేసి వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడతామని చెప్పారు.



బస్టాండ్ వెనక పేరుకుపోయిన మురుగు

పంచాయతీ వార్డు సభ్యుడు ఆకస్మిక మృతి

లింగాల: మండల పరిధిలోని దత్తారం గ్రామ పంచాయతీకి చెందిన నాల్గో వార్డు సభ్యుడు బాల లక్ష్మయ్య(47) ఆదివారం తెల్లవారుజామున నిద్రలోనే మృతి చెందాడు. ఉదయం కుటుంబసభ్యులు స్థానికులకు సమాచారం ఇవ్వగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దర కుమార్తెలు ఉన్నారు. ఈ సందర్భంగా వార్డు సభ్యుడి ఆకస్మిక మృతిపై సర్పంచ్ జంగమ్మ, వార్డు సభ్యులు, నాయకలు గ్రామస్తులు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.